## సింగిల్ పేజీ కథలు

# పరిహారం

"లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం దాసీభూత సమస్త దేవ వనితాం, లోకైక దీపాంకురామ్" అంటూ పూజ ముగించబోతున్న నాకు కొబ్బరికాయలోయ్, కొబ్బరికాయలు అంటూ కేక వినిపించింది. ఎలాగూ శుక్రవారం కదా అమ్మవార్కికి కొబ్బరికాయ కొట్టాలనిపించింది. వెంటనే పూజకి కామాపెట్టి, "ఇదిగో కొబ్బరికాయ లబ్బీ, ఇలారా" అంటూ కేకేశాను. బరువైన గంపతో భారంగా వచ్చాడు.

"ఎంతకిస్తావేమిటి?" అంటూ అడిగాను.

"పదికి రెండమ్మా. కాయలు బంగారం లాగున్నాయ్. తీసుకోండమ్మా" అన్నాడు.

అతని మాటల్లో కష్టజీవి తొంగి చూశాడు. "ఓ రెండు కాయలివ్వు" అంటూ రెండుకాయలు ఏరుకున్నాను. "చిల్లర లేదు కానీ యాభై రూపాయలకు చిల్లరివ్వు" అంటూ 50 రూపాయల నోటు అందించాను. "నీ పేరేమిటి? కొబ్బరి తోటేమైనా ఉందా? రోజూ వస్తున్నావు" అని అడిగాను.

"నన్ను సాంబయ్య అంటారమ్మ. మాకు పది కొబ్బరిసెట్లున్నాయంతే. మా ఆడోళ్ళు, నేను కలిసి కట్టపడి పెంచాం. ఇప్పుడు కాపుకొచ్చాయ్. ఇప్పుడే కదమ్మా నాలుగు డబ్బులు సంపాదించేది" అనడంతో అతనిలో నాకు ఆశాజీవి కనిపించాడు. అతిభారంగా గంపనెత్తుకుని మళ్ళీ అరచుకుంటూ అమ్మకం సాగించాడు.

'పాపం కష్టజీవులు' అని నిట్టూరుస్తూ ఇంట్లోకి రాబోతున్న నాకు అక్కడ పడి ఉన్న యాభై రూపాయల నోటు కనిపించింది. ఒక్క క్షణం చుట్టూ చూశాను. ఎవరన్నా చూస్తున్నారేమో అని. అమ్మయ్య వాకిట్లో ఎవరూ లేరు. నోటు చటుక్కున చేతిలోకి తీసుకున్నాను. ఆ నోటు ఖచ్చితంగా సాంబయ్యదే. సందేహం లేదు. నన్నెవరన్నా గమనిస్తున్నారా అని మరోసారి చుట్టూ చూశాను. ఎవరూ లేరు. నోటు సాంబయ్యదే. అతనికిచ్చేయ వచ్చుగా? సందు మలుపు తిరగబోతున్న అతన్ని డబ్బు ఇవ్వడం కోసం వెనక్కు పిలవబోయి తమాయించుకున్నాను.

డబ్బులు అతనికెందుకివ్వాలి? మనసు ఎదురు తిరిగింది. అతను మాత్రం నిజాయితీగా వ్యాపారం చేస్తున్నాడా? అసలు ఈ డబ్బులు అతనివే అని ఏంటి? శ్రీవారు ఆఫీసుకెళ్తూ పారేసుకోనుండవచ్చు అని నా మనసున సమాధానపరచుకున్నాను. అతన్ని పిలవాలని పైకి లేచిన చెయ్యి క్రిందికి దిగిపోయింది. తొందరపడటం ఎందుకు? శ్రీవారిని కనుక్కుని రేపు ఇవ్వచ్చుగా. లాటరీలో లక్ష రూపాయలు దొరికిన ఫీలింగ్ కలిగింది.

శ్రీవారు ఆఫీసు నుండి రాగానే డబ్బు చూపించి జరిగింది చెప్పాను. డబ్బులు తప్పకుండా 'మావే' అని నా నమ్మకం. నా నమ్మకాన్ని వమ్ము చేస్తూ, తన డబ్బులేమీ పోలేదనీ, అవి అతనివే అయి ఉంటాయనీ వెంటనే ఇచ్చేసెయ్యమని శ్రీవారు సలహా చెప్పారు. ఇవ్వాలనే



ఉంది, కానీ మనసెక్కడో ఎదురు తిరుగుతోంది. అతనెంతమందిని మోసం చేస్తున్నాడో? లోకంలో న్యాయం ఎక్కడుంది? చూద్దాంలే అని జవాబిచ్చాను.

మర్నాడు దేవుడి ముందు లక్ష్మీ అష్టోత్తరం చదువుతున్న నాకు సాంబయ్య కొబ్బరికాయల కేక సూటిగా తగిలింది. "అమ్మా! కొబ్బరికాయలు కావాలా? నిన్న నువ్వు బోణీ చేశావు చకచకా అమ్ముడుపోయాయి. మాలచ్చిమి తల్లి, ఇయాల కూడా నువ్వే బోణీ చెయ్యమ్మా" అంటూ ఇంటి ముందు గంప దింపాడు.

అతన్ని చూడగానే "ఈ డబ్బు నీదేనా" అనబోతున్న నా నోటిని నేనే నొక్కేశాను. కొబ్బరికాయలు తీసుకుంటుంటే అతనే చెప్పుకుపోతున్నాడు. "నిన్న యాభై రూపాయలు పారేసుకున్నానమ్మా, ఎవరికంటబడిందో, తిరిగి రాలేదు. మన చేతిలో ఉన్నంతవరకే మనది, చెయ్యి దాటితే తిరిగి రాదు. రెండు రోజుల లాభం ప్రాప్తం లేదు. అయినా ధర్మం, న్యాయం ఎక్కడున్నాయ్?" చెప్పుకుంటూ గంపెత్తుకుని వెళ్ళిపోయాడు.

అతని మాటలు చురుకుగా తగిలాయి. తిరిగి ఇచ్చేస్తేనో? పోనిద్దురూ, వెళ్ళిపోయాడుగా. అతనికి ప్రాప్తం లేదు. మనకి ప్రాప్తం ఉంది. ఏదో ఖర్చుకి అవే ఉపయోగపడతాయి.

లక్ష్మీదేవి తనంతట తానై వచ్చింది. పంపించేయకూడదు. ధీమాతో మరోసారి నోటు వంక చూసి బీరువాలో దాచేశాను. శ్రీవారు మాత్రం సణుగుతూనే ఉన్నారు. "నువ్వు చాలా పెద్ద తప్పు చేశావు. ఒక కష్టజీవి శ్రమని దోపిడి చేశావు, నువ్వు చేసే పూజలన్నీ వృధా, పరాయి సొమ్ముకి ఆశించడం పాపం" ఇలాంటి మాటలెన్నో అంటూనే ఉన్నారు. ఆ మాటలని ఒంటిమీద పడ్డ దుమ్ము దులుపుకున్నంత తేలికగా దులిపేసుకున్నాను. కానీ నా మనసులో ఎక్కడో తప్పు చేసిన ఫీలింగ్.

మరునాడు యధాప్రకారం పూజముందు కూర్చుని, శ్రీవారి ప్రమోషన్ కోసం మొక్కుకున్న ఆరుకొబ్బరి కాయలు కొట్టి అష్టోత్తరం చదువుతున్న నేను ఉలిక్కిపడ్డాను. అమ్మవారు నావంకే తీక్షణంగా చూస్తున్నట్లనిపించింది. నేనేదో తప్పు చేశాను. లేదే నేనసలే తప్పు చెయ్యనే? మరేమిటీ మార్పు. ఇంతలో కొబ్బరికాయల వాడి కేక ఉలిక్కిపడ్డాను. నేను చేసింది తప్పా? మొదటిసారి ప్రశ్నించుకున్నాను. అక్షరాలా దోషమే. ప్రార్థించే పెదవులకన్నా సాయపడే చేతులు మిన్న అని ఎక్కడో చదివిన గుర్తు. సాయపడకపోగా శ్రమను దొంగిలించాను. ఎవరికి వారు న్యాయం లేదంటూ అన్యాయానికి పాల్పడితే ఇంక న్యాయదేవతకు చోటేది? మహాపాపం చేశాను. దీన్ని సరిదిద్దుకోవాలి. అమ్మవారి ముందు గట్టిగా లెంపలు వేసుకున్నాను. "మన్నించు తల్లీ" అంటూ. కానీ చేసిన తప్పుని ఎలా దిద్దుకోవాలో అర్థం కాలేదు. ఆ నోటు అలాగే సాంబయ్యకిస్తే నేనే దొంగనని ఖచ్చితంగా అనుమానిస్తాడు. చేసిన తప్పుని తిరిగి తీసుకోలేను కానీ ప్రాయశ్చితం చేసుకోవాలి. ఆలోచించాను.

మర్నాడే శ్రీవారి పుట్టినరోజు. సాంబయ్య 50 రూపాయల నోటుని చిల్లరగా మార్చేశాను. పుట్టినరోజు వంకతో ఊళ్ళోని గుళ్ళన్నీ తిరిగి మెట్ల మీద కూర్చునే అభాగ్యులందరికీ తలో రూపాయి వేసేశాను. నా పాపాన్ని రూపాయి బిళ్ళలతో కడిగేయాలనుకోవడం కూడా తప్పేనేమో.

కానీ తప్పదు శ్రీవారు నాలో మార్పు గమనించారేమో. మందహాసంతో నా భుజం తట్టారు. ఇల్లు చేరి అమ్మవారి పటం ముందు అష్టోత్తరం చదువుతున్న నాకు అమ్మవారి చూపు మన్నించినట్లు తోచింది. ఇంతలో సాంబయ్య కొబ్బరికాయల కేక ఈసారి నేను ఉలిక్కిపడలేదు. ఏదో మహత్కార్యం చేసిన ఫీలింగ్.

అతనికోసమే ఎదురుచూస్తున్నట్లుగా గబగబా వెళ్ళి సాంబయ్యను ఇంట్లోకి పిలిచాను. "సాంబయ్యా, ఈరోజు మావారి పుట్టినరోజు. అన్నం, కూరలు సర్ది ఉంచాను. నీకు ఇవ్వాలనిపించింది. ఇంటికి తీసుకెళ్ళి నీ భార్య, పిల్లలకు పెట్టు" అంటూ అతనికి అందించాను. అవి నా పాప పరిహారార్థం ఇస్తున్నవని తెలియక మా తల్లి, మా లచ్చమ్మ తల్లి అంటూ ప్రసాదంలా కళ్ళకద్దుకున్నాడు. పాపాన్ని పరిహారం చేసుకోకపోయినా ఒక మంచి పని చేసిన తృప్తి మిగిలింది. శ్రీవారు నా చెయ్యి నొక్కి వదిలారు. అది అభినందన తాలూకు స్పర్శ అని అర్థం అయింది.

**-జి.పద్మజ (మాచర్ల)**

# బిజినెస్

**"ఏమ్‌రా? అనుకున్న టైంకి పని జరిగిపోవాలని జెప్పినా గదరా! పని వదిలేసి పరాచికాలాడుకుంటున్నార్రా? ఆ యాద్గిరి, మల్లేష్ ఆళ్ళ గ్యాంగు యాడికి బోయినార్రా? ముందు అర్జంటుగా నా రూమ్ కొచ్చి నన్ను గల్వమని జెప్పు. మొత్తం అయిదు గల్లీల్లో టెంట్‌లు ఏసిర్రు. నా దగ్గరకొచ్చినంక స్పాట్ జెప్పి అడ్వాన్సు ఇచ్చి బంపుతా. అవతల పార్టీకి మాటిచ్చినం. మాటబోగూడదు మల్ల. మాటబోతే మనుగడుండదురా పేనం బోయినట్టే లెక్క. ఏం అర్థమయినాదిరా?" అంటూ ఆవేశంతో ఫోన్ ఆఫ్ చేసి బైక్ స్టార్ట్ చేసుకుని రూమ్ కొచ్చేశాడు వీరేశం.**




కరెక్టుగా పదే పది నిమిషాల్లో యాదగిరి, మల్లేష్ వాళ్ళగ్యాంగ్‌తో సహా అక్కడ ప్రత్యక్షమయిపోయారు. కోపంలో రగిలిపోతున్న వీరేశం ముఖంలోకి చూడలేక తలలు వంచుకుని నిల్చున్నారు వాళ్ళంతా.

"ఏమ్‌రా యాద్గిరి చెప్పిన టైం మరిచిపోయినార్రా? పోనీ మీ పైసలెప్పుడన్నా ఇయ్యకున్నానా. పని పూర్తికాగానే అందరికీ పైసలు ముట్టజెప్తున్న గదరా" కోపంగా ప్రశ్నించాడు వీరేశం.

ఎవరూ బదులివ్వలేదు. రెండు నిమిషాలు ఆలోచించి, ఆవేశం పాళ్ళు కొంచెం తగ్గించి అక్కడి మౌనాన్ని భగ్నం చేస్తూ, సముదాయిస్తున్న రీతిలో "అయ్యిందేదో బోనీ గిప్పుడు జెప్తున్న ఇగ్గో తలో పది అడ్వాన్సు. పూర్తయినంక మిగతాయిస్త" అంటూ తలో పది చొప్పున అడ్వాన్సుగా ఇచ్చేశాడు వీరేశం.

వీరేశం ఇచ్చిన అడ్వాన్సు పుచ్చుకొని ఇంకా అక్కడే మౌనంగా నిలబడున్నారు యాద్గిరి ఆది గ్యాంగ్.

"ఏమ్‌రా? ఇంకా ఇక్కడే వున్నారు. బయలుదేరుండ్రి" ఆర్డరేశాడు వీరేశం.

మల్లేష్ మెల్లగా గొంతు సవరించుకుని, కొంచెం ధైర్యం చేసి అన్నాడు "స్పాట్ ఎక్కడో జెప్తుతానన్నవ్ గన్నా"

"అరె అసలిషయం యాది లేదు. తూర్పు ఈధిలోకి మవ్వు, దక్షిణ ఈధిలోకి నువ్వు చైతన్య స్కూల్ పక్కన నువ్వు, పిపిగార్డెన్స్ ఫంక్షన్ హాల్ దగ్గర నువ్వు" అంటూ తలో స్పాట్ చెప్పేశాడు వీరేశం.

అయిదే అయిదు నిమిషాల్లో అక్కడ్నుంచి మాయమయిపోయారు. వీరేశం టెన్షన్, టెన్షన్‌గా అక్కడే అటూ ఇటూ తిరుగుతున్నారు.

"హ..కసక్ కసక్ కసక్.." వెరైటీగా క్రూరమైన స్వరంతో రింగవుతోంది. వీరేశం జేబులో వున్న సెల్ ఫోన్.

వీరేశం జేబులో వున్న సెల్‌ఫోన్ బయటకు తీసి నంబరు చూసి చిరాగ్గా మొఖం పెట్టి, ఆ క్రూర స్వరాన్ని ఆపేసి, చెవి దగ్గర పెట్టుకుని తన వీర స్వరంతో "హలో" అన్నాడు.

అటువైపునుండి వీరేశం కమిట్ అయిన 'పార్టీ' పని గురించి ఎంతవరకొచ్చిందంటూ అడుగుతున్నారు.

"అయిపోద్దన్నా! సాయంత్రం ఆరు గంటలకల్లా మీ దగ్గరుంట. ఈరేశం మాటిస్తే ఆరుమూరైనా మూరు ఆరైనా పని జరిగిపోద్దన్నా వుంటనన్నా" ఫోన్ ఆఫ్ చేసి మళ్ళీ జేబులో పెట్టేశాడు వీరేశం.

* * *

సాయంత్రం నాలుగ్గంటలకు యాదగిరి, మల్లేష్ ఆళ్ళగ్యాంగ్‌తో సహా వీరేశం ముందు నిలబడున్నారు.

"ఏమ్‌రా? యాద్గిరి ఎన్నిరా?" వీరేశం ప్రశ్నించాడు.

"ఎయ్యన్నా" బదులిచ్చాడు యాదగిరి.

"పొద్దుగాల పదిచ్చిన గిదుగో ఇంకో పది దీస్కోరా.." అలా మిగతా వాళ్ళకు కూడా వాళ్ళు చెప్పిన నంబర్లను బట్టి డబ్బిచ్చేసి మిగతా కార్యక్రమాలు ముగించే పనిలో పడ్డాడు వీరేశం.

* * *

కరెక్టుగా ఆరుగంటలకు "అన్నమాట దప్పడం ఈ ఈరేశం డిక్షనెరీలో లేదన్నా. చూశారుగా టైమంటే టైమే" అంటూ తాను రీప్యాక్ చేయించి తీసుకొచ్చిన యూజ్‌డ్ డిస్పోజల్ గ్లాసులు, టీ కప్పుల పార్శిల్స్ బైక్ మీది నుండి దింపి ఆ షాపువాళ్ళకు అదే 'పార్టీ'కి అందిస్తూ చెప్తున్నాడు వీరేశం.

అలా ఎక్కడ ఏ ఫంక్షన్లు జరుగుతున్నాయో ముందుగా ఆరాతీస్తూ, కొంతమంది పిల్లల్ని పోగేసుకుని, వాళ్ళకు పదో పరకో ముట్టజెప్తూ తాను చేసే చెత్త వ్యాపారంతోపాటు ఈ కొత్త వ్యాపారాన్ని కూడా ఆరు పువ్వులు ఆరవై ఆరు కాయలుగా జేసుకుంటున్నాడు వీరేశం.

**-మాణిక్యాల శ్రీనివాసరావు (హైదరాబాద్)**